వైభవంగా భావనారుషి ఆలయ భూమిపూజ

నాదెండ్ల: గణపవరం పద్మశాలీయ పేటలో ఆదివారం భద్రావతి సమేత భావనారుషిస్వామి ఆలయ నిర్మాణం కోసం భూమిపూజ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన గాత్రం నాగయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారులు భగవత్‌సింగ్, వీరయ్య ఐదు సెంట్లు విరాళంగా అందించారు. సుమారు రూ.50 లక్షలతో నిర్మించనున్న ఆలయ భూమి పూజ కార్యక్రమానికి ప్రతిష్టాచార్యులు, కోటప్పకొండకు చెందిన కె.నాగభోగేశ్వర శర్మ, సీహెచ్ సాయిరాజీవ్‌శర్మ, రాజేశ్వరశాస్త్రి, అప్పయ్యశర్మ, పేరయ్య శాస్త్రి బృందం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 11.31 గంటలకు సంప్రదాయబద్ధమైన మేళతాళాలతో శాస్త్రోక్తంగా భూమి పూజ నిర్వహించారు. నవధాన్యాలు వేసి 108 బిందెలతో మహిళలు జలాదివాసం చేశారు. అనంతరం భారీ అన్నదానం నిర్వహించారు. తొమ్మిది నెలల్లో నిర్మాణ పనులు పూర్తి చేసి ప్రతిష్ట కార్యక్రమం వైభవంగా నిర్వహించాలని తీర్మానం చేశారు. కార్యక్రమానికి ఉమ్మడి గుంటూరు జిల్లా చేనేత విభాగం రీజనల్ కోఆర్డినేటర్ అవ్వారు అన్నపశెట్టి, పద్మశాలీయ సంఘం పట్టణ అధ్యక్షుడు కస్తూరి వెంకటేశ్వర్లు, ఏపీఎంసీ డైరెక్టర్ పోలయ్య పాల్గొన్నారు.


ప్రతిష్ట కార్యక్రమంలో స్థలదాత వీరయ్య, భగవత్‌సింగ్, పద్మశాలీ సంఘీయులు

పోరాటయోధుడు కుమురం భీమ్

చిలకలూరిపేట: గిరిజన హక్కుల సాధన కోసం అలుపెరుగని పోరాటం చేసిన గొప్ప యోధుడు కుమురం భీమ్ అని ఏపీ గిరిజన సంఘాల ఐక్య వేదిక అధ్యక్షుడు బి.శ్రీనునాయక్ చెప్పారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఉన్న ఏలూరి సిద్ధయ్య విజ్ఞాన కేంద్రంలో కొమురం భీమ్ జయంతిని గిరిజన సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ జల్, జంగల్, జమీన్ అంటూ ఆదివాసుల హక్కుల కోసం నినదించారని పేర్కొన్నారు. అడవి బిడ్డల ఆత్మగౌరవం కోసం నిజాం సైన్యంతో పోరాటం చేశారని తెలిపారు. గిరిజనులకు జరుగుతున్న అన్యాయాలను చూసి కొమురం భీమ్ 16 ఏళ్ల వయసు నుంచే పోరాటం చేశారని వెల్లడించారు. ఆదివాసులతో ప్రత్యేక గెరిల్లా సైన్యం ఏర్పాటు చేసి పోరాడారని, ఆయన పోరాటపటిమ నేటి తరానికి ఆదర్శం కావాలని చెప్పారు. కార్యక్రమంలో సంఘ నాయకులు బి.చిన్నానాయక్, పాలపర్తి శ్రీనివాసరావు, బి.రాంబాబునాయక్, కె.వాగ్యానాయక్, కుంభా నాగేశ్వరరావు, కొండ్రముట్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.


కుమురం భీమ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గిరిజన సంఘాల ఐక్యవేదిక నాయకులు

గ్రామదేవత గుడికి ఉత్సవ విగ్రహాలు బహూకరణ

యడ్లపాడు: మండలంలోని బోయపాలెం సుగాలీ కాలనీలోని గ్రామదేవత గుడికి ఉత్సవ విగ్రహాలను దాతలు అందజేశారు. గ్రామానికి చెందిన మల్లెల శివయ్య కుటుంబ సభ్యులు అంకమ్మతల్లి, పోతురాజు గుడి వార్షికోత్సవం సందర్భంగా మకర తోరణం, అంకమ్మతల్లి, పోతురాజుల పంచలోహ ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువెళ్లి ఆలయ ధర్మకర్తలు బద్దుల బాబూరావు, చెంచురామయ్యలకు వీటిని అందజేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దాతలు మల్లెల శివయ్య, వెంకటేశ్వరరావు, శంకర్, చెన్నయ్య, కామేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ వంకధారి శ్రీనుబాబు, వి.శ్రీనివాసనాయక్ పాల్గొన్నారు.


ఉత్సవ మూర్తుల్ని ఊరేగింపుగా తీసుకెళ్తున్న విగ్రహదాతలు

వైద్యశిబిరానికి విశేష స్పందన

యడ్లపాడు: ఆహారపు అలవాట్లతోనే షుగర్ వ్యాధిని నియంత్రణ సాధ్యమని ప్రముఖ వైద్యులు లింగమల్లు మోహన్‌భాస్కర్ చెప్పారు. యడ్లపాడు గ్రామ అభివృద్ధి కమిటీ, లింగారావు పాలెం విజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు ఉచిత వైద్యశిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. స్థానిక పీఆర్ విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన ఈ శిబిరంలో లింగమల్లు మోహన్ భాస్కర్, డాక్టర్స్ గుంటుపల్లి భవ్యతేజ, గుంటుపల్లి దివ్యతేజ, నేలటూరి రాజశ్రీ పాల్గొని 210 మంది రోగులకు బీపీ, షుగర్ సంబంధిత పరీక్షల్ని నిర్వహించి వైద్యసేవలు అందించారు. అనంతరం రెండునెలలకు సరిపడ మందుల్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో యడ్లపాడు అభివృద్ధి కమిటీ సభ్యులు గోనుగుంట్ల కిరణ్, ముత్తవరపు వేణుగోపాల్, రవీంద్రబాబు, విజయ్‌కుమార్, ఆరుమళ్ల నాగచౌదరి, కేతా రామబ్రహ్మం, పోపూరి శ్రీనివాసరావు, బచ్చు రాజేష్ కుమార్, అరె వంశీ, లింగారావు పాలెం విజన్ ఫౌండేషన్ సభ్యులు సామినేని శ్రీనివాసరావు, రావూరి సుమన్, సురేష్, సీహెచ్ రంగారావు, కోయ రామోజీరావు పాల్గొన్నారు.

సాగర్ జలాలు వృథా చేయవద్దు

శావల్యాపురం: సాగర్ జలాలతో మంచినీటి చెరువులు కళకళ లాడుతున్నాయని ఎన్నెస్పీ డీఈ డీఈ చాట్రగడ్డ రామారావు ఆదివారం తెలిపారు. డీఈ మాట్లాడుతూ ఈనెల 11 నుంచి 19 వరకు చెరువులకు తాగునీటి అవసరాల నిమిత్తం సాగర్ విడుదల చేశామన్నారు. మండలంలోని అద్దంకి బ్రాంచ్ కెనాల్ పరిధిలో 23 మంచినీటి చెరువులు ఉండగా 21 చెరువులను 80 శాతం నింపినట్లు చెప్పారు. మరో మూడు నెలల వరకు తాగునీటి సమస్య లేకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టామన్నారు. సాగర్ జలాలను వృథా చేయరాదన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

వినుకొండ(నూజెండ్ల): వినుకొండ రూరల్ మండలంలోని విఠంరాజుపల్లి గ్రామ సమీపంలో చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు... మండలంలోని చాట్రగడ్డపాడుకు చెందిన కర్రా రామలింగారెడ్డి(38) మోటారు సైకిల్‌పై స్వగ్రామానికి వస్తుండగా విఠంరాజుపల్లి గ్రామం మార్కెట్ యార్డు చెక్‌పోస్టు సమీపంలో లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రికెట్ క్రీడాకారుల అభ్యున్నతికి కృషి

ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు పురుషోత్తమరావు

నరసరావుపేట ఈస్ట్: క్రికెట్‌పై ఆసక్తి ఉండి అవకాశాలు రాని క్రీడాకారులను వెలికితీసి ఉత్తమ క్రీడాకారులుగా తయారు చేసేందుకు కృషి చేస్తానని ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు కె.వి.పురుషోత్తమరావు పేర్కొన్నారు. ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ సభ్యునిగా ఏకగ్రీవంగా ఎన్నికైన పురుషోత్తమరావును ఆదివారం సాయంత్రం పెదచెరువులోని ఏసీఏ ఎస్‌కేఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో జిల్లా క్రికెట్ అసోసియేషన్, స్థానిక క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. పురుషోత్తమరావు మాట్లాడుతూ, తన క్రికెట్ ప్రస్థానాన్ని, చిన్ననాటి తన క్రికెట్ మిత్రులను గుర్తుచేసుకొన్నారు. క్రికెట్ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఏసీఏ సభ్యుడు జి.మల్లికార్జునరావు, ఏసీఏ గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎన్.సీతాపతిరావు, జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధి రమణమూర్తి పాల్గొన్నారు.


పురుషోత్తమరావును సత్కరిస్తున్న క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధులు

రెండు కార్లు ఢీ..

ప్రయాణికులు సురక్షితం



యడ్లపాడు: రోడ్డు ప్రమాదంలో రెండు కార్లు పాక్షికంగా దెబ్బతినగా అందులోని ప్రయాణిస్తున్న వారికి ప్రమాదం తప్పింది. పోలీసులు తెలిపిన వివరాలు.. బాపట్ల జిల్లా బల్లికురవ మండలం కొత్తమల్లాయపాలెం గ్రామానికి చెందిన జూపల్లి రుద్రరాజు గుంటూరు నుంచి స్వగ్రామానికి కారులో వెళ్తుండగా.. తిమ్మాపురం తిరుమల కాటన్ మిల్లు సమీపంలో హైవేపై రహదారి పనులు చేస్తుండటం గమనించి ఒక్కసారిగా రైట్ సైడ్‌కు వాహనాన్ని మళ్లించాడు. అదే మార్గాన కాకినాడ నుంచి చెన్నైకు వెళ్తున్న కారుకు అడ్డురావడంతో షడన్ బ్రేక్ వేసినా వేగంలో అదుపకాక అడ్డుగా వచ్చిన కారును ఢీకొంది. దీంతో రెండు కార్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. అయితే కాకినాడ జిల్లా కిర్లంపాడు మండలం ముక్కొల్లు గ్రామానికి చెందిన కర్రీ సాయిరామ్ కారులో నలుగురు ఉన్నారు. ఊహించని విధంగా జరిగిన ఈ ప్రమాదంలో రెండు కార్లలోని ఐదుగురికి స్వల్పగాయాలు కూడా కాకపోవడంతో కార్లలోని వారితో పాటు రహదారి పనులు చేస్తున్న కార్మికులు సైతం ఊపిరి పీల్చుకున్నారు. ఘటనా స్థలానికి చేరుకున్న హైవే పోలీసులు కార్లను పక్కకు తీయించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేశారు.


ఆర్. అగ్రహారం కన్యకా పరమేశ్వరీ దేవస్థానంలో..


గంటలమ్మ చెట్టు వీధి వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారు..


బృందావన్ గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో..


అరండల్‌పేట అష్టలక్ష్మీ ఆలయం లో దుర్గాదేవిగా..

జయ..జయహే మహిషాసుర మర్దిని !

నగరంలో దేవీ శరన్నవరాత్రుల మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. పలు ఆలయాల్లో ఆదివారం అమ్మవారు మహిషాసుర మర్దిని అలంకారంతో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ, ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ఆలయాల్లో ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు, అన్నసమారాధనలు నిర్వహించారు.

– పాత గుంటూరు

మాసీ ఫెర్గూషన్ షోరూమ్ ప్రారంభం

నరసరావుపేట: కిసాన్ అగ్రిమాల్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థకు చెందిన ట్రాక్టర్ బ్రాండ్ మాసీ ఫెర్గూషన్ షోరూమ్ పిడుగురాళ్ల నరసరావుపేట రోడ్డులో కొండమోడు జంక్షన్‌లో ఆదివారం ఘనంగా ప్రారంభించారు. సంస్థ ఎండీ సౌమిత్రీ శ్రీవాత్సవ మాట్లాడుతూ మాసీ ఫెర్గూషన్ బ్రాండ్ ద్వారా 42 నుంచి 50 హెచ్‌పీ శ్రేణితో పాటు అనేక నూతన మోడల్స్‌ను మార్కెట్‌లోకి తీసుకొచ్చామన్నారు. సర్వీసు మేనేజర్ సాయికిరణ్ మాట్లాడుతూ అంతర్జాతీయ ప్రమాణాలు, ఆధునిక సదుపాయాలతో తయారైన ఈ ట్రాక్టర్ రైతు సోదరులకు నాణ్యత పరంగా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఫైనాన్స్ మేనేజర్ ధర్మ, అగ్రిమాల్ పాల్గొని అత్యుత్తమ నాణ్యతతో కూడిన ట్రాక్టర్లను రైతులకు సరఫరా చేయటం జరుగుతుందని వెల్లడించారు.


షోరూమ్‌ను ప్రారంభిస్తున్న సంస్థ ఎండీ సౌమిత్రీ శ్రీ వాత్సవ తదితరులు

పేద పిల్లల విద్యపై జనసేన, టీడీపీ అక్కసు

వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని

తాడేపల్లిరూరల్: బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, పేద, మధ్యతరగతి విద్యార్థుల చదువులపై జనసేన, తెలుగుదేశం పార్టీలు విషం కక్కుతున్నాయని వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని పేర్కొన్నారు. ఆదివారం దుగ్గిరాల గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేదవిద్యార్థులు ప్రపంచ స్థాయికి ఎదగాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా రంగంలో నూతన సంస్కరణలకు శ్రీకారం చుట్టారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు కూడా విదేశాలకు వెళ్లాలన్న సదుద్దేశంతో ప్రభుత్వం టోఫెల్‌పై శిక్షణ ఇస్తుంటే జనసేన, టీడీపీలు విషం చిమ్ముతున్నాయన్నారు. దేశం గర్వించదగ్గ శాస్త్రవేత్త, భారతరత్న మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం మాట్లాడింది గొప్ప ఇంగ్లిష్ కాదని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అనడం సబబు కాదన్నారు. ఇప్పటికైనా పేద, మధ్య తరగతి విద్యార్థులకు అందే సువర్ణ అవకాశాన్ని అడ్డుకునే ప్రయత్నాలకు స్వస్తి పలకాలని హితవు పలికారు.

యువత సన్మార్గంలో పయనించాలి



దాచేపల్లి: యువత సన్మార్గంలో పయనించాలని పాస్టర్ జీఎస్ ప్రసన్నకుమార్ అన్నారు. మండలంలోని కేసానుపల్లి క్రీస్తు లూథరన్ దేవాలయంలో యువజనుల ఆదివారం సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గీతాలు ఆలపించి వాక్య సందేశం అందించారు. పాస్టర్ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ యవ్వనంలో యువత చెడు మార్గంలో పయనించవద్దని, జీవితంలో స్థిరపడేందుకు ఆ దశ ఎంతో ముఖ్యమైందన్నారు. మహనీయులను ఆదర్శంగా తీసుకుని యువతీ, యువకులు జీవితంలో స్థిరపడాలని, క్రీస్తు బోధనలు పాటించాలని కోరారు. ప్రతిఒక్కరూ భక్తిశ్రద్ధలతో ముందుకు నడవాలని ఆకాంక్షించారు. భవిష్యత్ చిన్నారులు ప్రార్థన చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఈఎల్‌సీ డేలిగేట్ వినుకొండ బాబు, చర్చి డేలిగేట్ శ్రీపతి కాశయ్య, సర్పంచి వి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

లోక కల్యాణార్థం విశ్వశాంతి హోమం

పాత గుంటూరు: అరండల్‌పేట ఆర్య సమాజం ప్రాంగణంలో పండిత గోపదేవ్ వైదిక ధర్మ ప్రచార సమితి ఆధ్వర్యంలో ఆదివారం లోక కల్యాణార్థం విశ్వశాంతి హోమం నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సభకు డాక్టర్ కొండబోలు కృష్ణ ప్రసాద్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా వైదిక ధర్మ ప్రచారకులు డాక్టర్ కొసరాజు రవీంద్ర, మాగం కృష్ణమూర్తి, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు చైర్మన్ టి. కామేశ్వరరావు, ప్రచారకులు నాగభైరవ గంగా పార్వతి, కూరపాటి కల్యాణి రవీంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనంతపురం వైదిక ధర్మ ప్రచారకులు జి. కోదండ పాణికి ఆర్య పురుష బిరుదు, ప్రొద్దుటూరు ఆర్య సమాజం నిర్వాహకురాలు బి. పద్మావతికి ఆర్యమాత బిరుదు, నగదు అందించి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆర్య సమాజం అధ్యక్షురాలు గుర్రం నిర్మలాదేవి, వ్యవస్థాపక కార్యదర్శి ఏలూరి సూర్యనారాయణ, కార్యదర్శి వాసిరెడ్డి శ్రీనివాస ప్రసాద్ పాల్గొన్నారు.

కార్మెల్‌మాతను దర్శించుకున్న భక్తులు

ఫిరంగిపురం: మండలకేంద్రంలోని కార్మెల్‌కొండపై ఉన్న కార్మెల్‌మాతను దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఉదయాన్నే ధర్మవరం, ఆళ్లగడ్డ, వెంకటాయపాలెం, ధర్మగిరి ప్రాంతాలనుంచి వచ్చిన భక్తులు బాల ఏసుదేవాలయంలో నిర్వహించిన దివ్యపూజాబలిలో పాల్గొన్నారు. అనంతరం కార్మెల్ కొండను ఎక్కి తలనీలాలు సమర్పించి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు.

మతిస్థిమితం లేని యువకుడు అదృశ్యం

వంగళగిరి: మతిస్థిమితం లేని యువకుడు అదృశ్యమైన ఘటన చోటు చేసుకుంది. ఆదివారం పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పాత మంగళగిరికి చెందిన గార్లపాటి సాయిరామకృష్ణ గత ఎనిమిది సంవత్సరాలుగా మతిస్థిమితం కోల్పోయాడు. శనివారం రాత్రి సాయిరామకృష్ణ తల్లి నాగలక్ష్మి బయటకు వెళ్లివచ్చి చూసేసరికి రామకృష్ణ కనపడలేదు. బంధువులు, స్నేహితుల వద్ద వెతికినా కనబడక పోవడంతో నాగలక్ష్మి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అలరిస్తున్న వీణా అవార్డ్స్ నాటక పోటీలు

తెనాలి: కళల కాణాచి–తెనాలి, వేదగంగోత్రి ఫౌండేషన్–విజయవాడ సంయుక్త నిర్వహణలో తెనాలిలో నిర్వహిస్తున్న తృతీయ జాతీయ పద్యనాటక/సాంఘిక నాటికల పోటీలు వీణా అవార్డ్స్–2023 మూడో రోజు ఆదివారం కొనసాగాయి. శ్రీ టీబీఆర్ ఆర్ట్స్ థియేటర్, కూకట్‌పల్లి, హైదరాబాద్ వారి శ్రీస్వామి అయ్యప్ప పద్య నాటకాన్ని ప్రదర్శించారు. వల్లేటి లక్ష్మీ కులశేఖర్ రచించిన ఈ నాటకానికి టి.ఇందిరాదేవి దర్శకత్వం వహించారు. ధర్మశాస్త/అయ్యప్పగా చిరంజీవి పి.హృషీకేశ్, శివుడు/రాజశేఖర పాండ్యుడుగా టి.బాబురాజు, విష్ణుమూర్తిగా బి.తులసీకృష్ణ, బ్రహ్మగా టి.వెంకటేష్, మోహిని, మహారాణిగా వెంగమాంబ సురభి నటించారు. సంగీతం డాక్టర్ ఎస్.చంద్రబాబునాయుడు సమకూర్చారు. సెట్స్ అండ్ లైటింగ్ సురభి సంతోష్ అందించారు. అనంతరం శ్రీకుమార భీమేశ్వర నాట్యమండలి, కాకినాడ వారి నర్తనశాల నాటకం ప్రదర్శించారు. కాశ్లూరి రామారావు రచనకు ఎస్‌కే అమీర్ దర్శకత్వం వహించారు. సాయంత్రం అభినయ ఆర్ట్స్–గుంటూరువారి సాంఘిక నాటకం 'ఇంద్రప్రస్థం'ను ప్రత్యేకంగా ప్రదర్శించారు. స్నిగ్ధ రచనకు ఎస్.రవీంద్రరెడ్డి దర్శకత్వం వహించారు. రాత్రి 7 గంటలకు సిరిమువ్వ కల్చరల్స్–హైదరాబాద్ వారి మాట్లాడుకుందాం సాంఘిక నాటికను ప్రదర్శించారు. మాడభూషి దివాకరబాబు రచనకు మంజునాథ్ దర్శకత్వం వహించారు. కళల కాణాచి గౌరవ సలహాదారు గోగినేని కేశవరావు, వ్యవస్థాపక కార్యదర్శి షేక్ జానీబాషా, కోశాధికారి దేవరపల్లి భవాని, సహాయ కార్యదర్శులు గోపరాజు విజయ్, కొండముది రమేష్ పర్యవేక్షించారు.













వృద్ధులకు బియ్యం, నిత్యావసరా కిట్లు పంపిణీ

నగరంపాలెం: వృద్ధులు, దివ్యాంగుల్ని ప్రతి ఒక్కరూ ఆదుకోవాలని గిరిధారి మిత్ర మండలి అధ్యక్షుడు బవిరిశెట్టి శ్రీనివాసరావు కోరారు. కొత్తపేటలోని కార్యాలయంలో ఆదివారం యాభై మంది వృద్ధులు, దివ్యాంగులకు ఉచితంగా బియ్యం, నిత్యావసర కిట్లతో పాటు మహిళలకు చీరల్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ సామాజిక సేవ చేయడం వల్ల కలిగే సంతృప్తి ఎనలేనిదని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి పలకలూరి శివరావు, కోశాధికారి దిండు రాజశేఖర్, సభ్యులు పబ్బిసెట్టి సంజీవరావు, గార్లపాటి రోశయ్య, ఎన్.విజయలక్ష్మి, తాటికోల పద్మావతి పాల్గొన్నారు.

చికిత్సపొందుతూ వ్యక్తి మృతి

ఫిరంగిపురం: రోడ్డు ప్రమాదంలో గాయాలై గుంటూరులో చికిత్స పొందుతూ వ్యక్తి ఆదివారం మృతిచెందిన సంఘటన మండలకేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలప్రకారం మండలకేంద్రంలోని ఇ.సుధాకర్(54) ఎస్సీ హాస్టల్‌లో కమాటీగా పనిచేస్తుంటాడు. ఈనెల 21 సాయంత్రం ద్విచక్రవాహనంపై వేములూరిపాడు వెళ్లి తిరిగి వస్తుండగా పోలీసు చెక్‌పోస్టువద్ద ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు సుధాకర్‌ను ఢీకొంది. విషయం తెలుసుకున్న పోలీసులు సుధాకర్‌ను గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. చికిత్సపొందుతూ సుధాకర్ మృతిచెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చల్లా కిషోర్ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

తెనాలిరూరల్: రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. తెనాలి–విజయవాడ రైలు మార్గంలోని కొలనుకొండ, కృష్ణా కెనాల్ స్టేషన్ల మధ్య పట్టాల వెంబడి మృతదేహం ఉందన్న సమాచారంతో తెనాలి జీఆర్పీ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. సుమారు 30 నుంచి 35 ఏళ్ల మధ్య వయసున్న వ్యక్తి మృతి చెంది ఉండడాన్ని గుర్తించారు. మృతుడు రైలు నుంచి జారిపడి ఉంటాడని భావిస్తున్నారు. మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు.

కనకదుర్గమ్మకు నృత్య నీరాజనం


నృత్యకారిణులతో నాట్యగురువు అనుశేఖర్

గుంటూరు ఎడ్యుకేషన్: అమరావతి రోడ్డులోని హిమసీనగర్‌లో స్నేహమిత్ర ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ద్వితీయ దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు. శ్రీనగర్‌కు చెందిన అను డ్యాన్స్ అకాడమీ నృత్యకారిణుల బృందం నాట్య గురువు అనుశేఖర్ పర్యవేక్షణలోనృత్య ప్రదర్శనలు ఆద్యంతం భక్తితన్మయత్వంలో ఓలలాడించాయి.









క్లుప్తంగా

విజయదశమి శుభాకాంక్షలు

ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: తెలుగు రాష్ట్రాల ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి సంకేతంగా నిర్వహించుకునే విజయదశమి పర్వదినాన్ని ఇంటిల్లిపాదీ ఆనందోత్సాహాలతో నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు. దసరా పండుగ అందరి జీవితాల్లో విజయాలు సమకూర్చాలని, చేపట్టిన ప్రతి కార్యం సఫలీకృతం కావాలని, అమ్మవారి అనుగ్రహం ఎల్లవేళలా ఉండాలని, దుర్గామాత కరుణాకటాక్షాలతో అన్ని వర్గాల వారు సుభిక్షంగా, సుఖ సంతోషాలతో జీవించాలని, దీనికి అమ్మవారి ఆశీస్సులు అందరికీ ఉండాలని తాను కోరుకుంటున్నట్లు వెల్లడించారు.

నేడు, రేపు విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు

నరసరావుపేట: దసరా సెలవులు అయినప్పటికీ సోమ, మంగళవారాల్లో బరంపేట విద్యుత్ కార్యాలయంలో విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చని డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వై.ఏడుకొండలు ఆదివారం సాయంత్రం వెల్లడించారు. ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4గంటల వరకు వినియోగదారుల నుంచి బిల్లులు కట్టించుకోబడతాయని పేర్కొన్నారు.

సాతులూరులో చోరీ



నాదెండ్ల: సాతులూరు గ్రామంలోనీ ఎస్సీ కాలనీలో శనివారం అర్ధరాత్రి భారీ చోరీ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన తాటిగిరి కిశోర్ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తుంటాడు. ఇతరులకు బాకీ చెల్లించేందుకు ఈ నెల 13న నగలు బ్యాంకులో తనఖా ఉంచి రూ.లక్ష రుణం తీసుకున్నాడు. ఈ నెల 15న ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలసి నంబూరు ప్రార్థనకు వెళ్లాడు. అక్కడి నుంచి తిరిగి ప్రత్తిపాడు మండల యనమదల గ్రామంలోని అత్తవారింటికి వెళ్లాడు. కిషోర్ ఇంటి సమీపంలో తండ్రి జయరావు, మరో పక్క అన్న కిరణ్ నివాసం ఉంటారు. కిషోర్ కుటుంబ సభ్యులు ఇంట్లో లేకపోవటంతో తల్లి ప్రతి రోజూ ఇంటి ముందు శుభ్రం చేస్తుండేది. ఆదివారం ఉదయం ఇంటి ముందు శుభ్రం చేసేందుకు రాగా, ఇంటి తాళాలు పగలగొట్టి ఉండటం గమనించింది. వెంటనే కుమారుడు కిషోర్‌కు సమాచారమివ్వగా, ఇంటికి వచ్చి చూసుకొని రూ.లక్ష, ఐదు సవర్ల బంగారు ఆభరణాలు చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చాడు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి వివరాలు సేకరించారు. ఎస్‌ఐ బలరామిరెడ్డి కేసు నమోదు చేశారు.

బెల్లం ఊట ధ్వంసం



నరసరావుపేట టౌన్: నాటుసారా తయారీ కేంద్రంపై స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు ఆదివారం దాడులు నిర్వహించి 400 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. నకరికల్లు మండలం చేజర్ల గ్రామ శివారు పొలాల్లో సారా తయారీ కేంద్రంపై దాడులు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. అక్కడ తయారీకి ఉపయోగించే బెల్లం ఊటను గుర్తించి ధ్వంసం చేశారు. పోలీసుల రాకను ముందే గమనించిన నిందితులు ఘటనా స్థలం నుంచి పరారీ అయ్యారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అభిషేకానికి వెండి బిందె బహూకరణ



నకరికల్లు: మండలంలోని నర్సింగపాడులో గల శ్రీ అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వరస్వామి వారికి అభిషేకం చేసేందుకు కారంపూడికి చెందిన ఆత్మకూరి రామారావు, వెంకటలక్ష్మీ దంపతులు ఆదివారం వెండి బిందెను బహూకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు కొమ్మవరపు పవన్‌కుమార్ శర్మకు వెండి బిందెను అందజేశారు. అనంతరం అమ్మవారికి, స్వామివారికి విశేష పూజలు చేశారు. ఆలయంలో గో పోషణ నిమిత్తం ఆత్మకూరి అవినాష్, తుషారలక్ష్మి దంపతులు రూ.5,116లు సమర్పించారు.



నరసరావుపేటలో మహిషాసురమర్దిని అలంకరణలో వాసవి అమ్మవారు



మహాదుర్గా అలంకరణలో శారదాంబ అమ్మవారు..



దుర్గా అలంకరణలో పార్వతీ అమ్మవారు ..



వడ్డెంగుంటలో జ్ఞాన ప్రసూనాంబ కాళహస్తీశ్వర దేవాలయంలో కనకదుర్గాదేవిగా అమ్మవారు..



నాయుడుపాలెంలో లలితాదేవిగా వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారు

వైభవంగా దసరా ఉత్సవాలు



నూజెండ్ల జగన్మాతపీఠంలో దుర్గాదేవిగా అమ్మవారు..




రొంపిచర్లలో మహిషాసురమర్దిని అలంకరణలో వాసవీ అమ్మవారు



దుర్గాదేవి అలంకరణలో రొంపిచర్ల చౌడేశ్వరీ అమ్మవారు



గణపవరం శాంతినగర్‌లో దుర్గాదేవిగా..



శివప్రియనగర్ ఆదిపరాశక్తి క్షేత్రంలో రాజరాజేశ్వరిగా..



రాంనగర్ చలువ పందిరిలో మహిషాసురమర్దినిగా



వాసవికన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శాకంబరీ దేవి అలంకరణ

నరసరావుపేట ఈస్ట్: శ్రీ దేవి శరన్నవరాత్ర ఉత్సవాలు పట్టణంలో వైభవంగా కొనసాగుతున్నాయి. ఆయా ఆలయాలలో అమ్మవారు 8వరోజు మహిషాసురమర్దిని, దుర్గా అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధికసంఖ్యలో అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు.

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

బొల్లాపల్లి: మండలంలోని పలు గ్రామాల్లోని దేవాలయాల్లో భక్తులు నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరైన ప్రత్యేక పూజలు చేశారు. 8వ రోజు మండలంలోని వడ్డెంగుంట గ్రామంలో శ్రీ జ్ఞాన ప్రసూనాంబ శ్రీ కాళహస్తీశ్వర దేవాలయంలో అమ్మవారు శ్రీ కనకదుర్గా అమ్మవారి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే నాయుడుపాలెం గ్రామంలో శ్రీ వాసవికన్యకా పరమేశ్వరి అమ్మవారు భక్తులకు కనకదుర్గాదేవిగా అమ్మవారు ప్రత్యేక పూజలు అందుకున్నారు.

జయహో... దుర్గాభవానీ

యడ్లపాడు: దసరా ఉత్సవాల్లో భాగంగా ఆదివారం దుర్గాష్టమి అలాగే రాత్రికి నవమి ప్రవేశించడంతో బోయపాలెం పార్వతీదేవి, హరిహరక్షేత్రం, సొలస బ్రహ్మంగారి గుడి, యడ్లపాడు రాజరాజేశ్వరస్వామి ఆలయాల్లో అమ్మవారు మహిషాసురమర్దినిగా, లింగారావుపాలెం గ్రామంలోని గంగా పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో సాయంత్రం వేళ అలంకరణ కావడంతో నవదుర్గదేవి అలంకరణలో అమ్మవారిని అలంకరణ చేశారు. ఆయా ఆలయాలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేసి తరించారు. ధర్మకర్తలు, అర్చకులు వివిధ రకాల ప్రసాదాలను పంపిణీ చేశారు.

దుర్గాదేవిగా అమ్మవారు దర్శనం

శావల్యాపురం: స్థానిక కనకదుర్గమ్మ అమ్మవారి దేవాలయంలో దసరా వేడుకల్లో భాగంగా అమ్మవారు దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. వేదపండితులు రావిపాటి సాయిభరత్ ఉభయ దాతలచే కుంకుమపూజలు విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం దేవాలయ ప్రాంగణంలో భక్తిబృందంతో భక్తిగీతాలు అలపించారు.

దుర్గాదేవిగా అమ్మవారు దర్శనం

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయం, కామాక్షి కమతేశ్వర ఆలయాలతో పాటు శాంతి ఆశ్రమం ట్రస్ట్ హిమాలయ గురూజీ ఆధ్వర్యంలో వినుకొండ రూరల్ మండలంలోని విఠంరాజుపల్లిలోని సాయి బృందావనం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక మండపంలో దేవీశరన్నవరాత్రి మహోత్సవాలు 8వ రోజు దుర్గాదేవిగా అమ్మవారు దర్శనమిచ్చారు. మహాచండీయాగం, అభిషేకాలు, దుర్గాదేవి అనుగ్రహ కటాక్ష సిద్ధి పూజ జరిపించారు. పాండ్యం మాజీ ఎమ్మెల్యే చరితారెడ్డి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ట్రస్ట్ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో దుర్గాష్టమి సందర్భంగా కూరగాయలతో శాకంబరీ అలంకరణ చేశారు. నూజెండ్ల మండలంలోని రవ్వవరం వెంకటేశ్వర జగన్మాతపీఠంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 8వ రోజున అమ్మవారు దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

దుర్గాదేవి అలంకరణలో అమ్మవారు..

రొంపిచర్ల: మండలంలో ఎనిమిదో రోజు ఆదివారం దేవి శరన్నవరాత్రులు ఘనంగా నిర్వహించారు. విప్పర్ల, కొత్తపల్లి, సంతగుడిపాడు, వడ్లమూడివారిపాలెం, రొంపిచర్ల తదితర గ్రామాలలో అమ్మవార్లను ప్రత్యేకంగా ,అందంగా అలంకరించి పూజలు నిర్వహించారు. స్థానిక ఎస్‌బీఐ బ్యాంక్ సమీపంలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలోని అమ్మవారిని మహిషాసురమర్దినిగా, అదే విధంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలోని చౌడేశ్వరీ దేవి ఆలయంలో చౌడేశ్వరి అమ్మవారు దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆయా అలంకరణలలో ఉన్న అమ్మవార్లను భక్తులు, మహిళలు అధికసంఖ్యలో సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయాల వద్దకు వచ్చిన వారికి ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. రాత్రి వేళల్లో ఆలయాల ఆవరణలో భజనా కార్యక్రమాలు నిర్వహించారు.



సొలస గ్రామం బ్రహ్మంగారి గుడిలో మహిషాసురమర్దినిగా దుర్గాదేవి



బోయపాలెం శ్రీపార్వతీదేవి ఆలయంలో మహిషాసురమర్దినిగా పార్వతీదేవి



లింగారావుపాలెం శివాలయంలో వనదుర్గ అవతారంలో పార్వతీదేవి..



యడ్లపాడు శివాలయంలో మహిషాసురమర్దినిగా రాజరాజేశ్వరీదేవి



వినుకొండ విఠంరాజుపల్లి సాయిబృందావనంలో దుర్గాదేవిగా అమ్మవారు

నేటి సమాజానికి యువతే అధారం



ఫాదర్ బాలస్వామిని సన్మానిస్తున్న యూత్‌ఫెస్టివల్ నిర్వాహకులు

అమరావతి: నేటి సమాజానికి, దేశ భవిష్యత్‌కు యువతే ఆధారమని ఏపీ ప్రభుత్వ క్రైస్తవ వ్యవహారాల మైనారిటీ సంక్షేమ సలహాదారుడు రెవరెండ్ ఫాదర్ డాక్టర్ ఎం బాలస్వామి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని ధరణికోట జైల్‌సింగ్‌కాలనీ లూథరన్ చర్చిలో ఆదివారం నిర్వహించిన యూత్‌ఫెస్టివల్‌లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి చర్చి పాస్టర్ సత్యానందకుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఫాదర్ బాలస్వామి మాట్లాడుతూ విద్యార్థులు వ్యసనాల జోలికి పోకుండా దైవచింతన, చదువుపట్ల అంకిత భావం, దేశభక్తి, పట్టుదల, నిరంతర కృషి వంటి లక్షణాలు కలిగి ఉండాలన్నారు. ఈ సందర్భంగా ఫాదర్ బాలస్వామిని యూత్‌ఫెస్టివల్ నిర్వాహకులు సన్మానించారు. యూత్‌ఫెస్టివల్ సభ్యులు లూకా, సుధాకర్, గోపి డార్సీ, విన్సీ వంశీ, పవన్, కళ్యాణ్‌లతో పాటు ధరణికోట లూథరన్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.


ఆత్మకూరులో వైభవంగా కుంకుమబండ్ల ఊరేగింపు



విద్యుత్ అలంకరణలో కుంకుమ బండి

ఆత్మకూరు (దుర్గి): శ్రీ బాలాత్రిపురసుందరీదేవి ఆలయంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రులలో భాగంగా ఆత్మకూరు గ్రామంలో ఆదివారం అమ్మవారికి కుంకుమ బండ్లను ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం గ్రామస్తులు కుంకుమ బండ్లను గ్రామంలో ఊరేగింపు నిర్వహించుకుంటూ ఆలయానికి చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకర్షించాయి. మండల జేసీఎస్ కన్వీనర్ బొబ్బా సీతారామిరెడ్డి ఆధ్వర్యంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రశాంతంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ బొబ్బ నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కసిరెడ్డి శాంతిరెడ్డి, రాయపరెడ్డి, కొత్త వరహాల రెడ్డి, బొబ్బా రాజశేఖర్ రెడ్డి, టి.రవికాంత్‌రెడ్డి, అడపాల అంబారావు, యరబోతుల సత్యనారాయణ, చవ్వా బాలస్వామిరెడ్డి, కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరంలో 160 మందికి పరీక్షలు



రెంటచింతలలో కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్లు దీక్ష, మంజోత్‌కౌర్, మహబూబ్

రెంటచింతల: స్థానిక వైఆర్‌ఎస్ ఉన్నత పాఠశాల ఆవరణలో శంకర కంటి ఆస్పత్రి పెదకాకాని వారి సౌజన్యంతో రూరల్ హోమ్ ఫౌండేషన్, అమెరికా, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్తంగా ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరంలో మొత్తం 160 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు నిర్వాహకులు గుండా జనార్ధన్‌రావు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో వివిధ ప్రాంతాలకు చెందిన కంటి సమస్యలతో బాధపడే 160 మందికి పలు వైద్యపరీక్షలు నిర్వహించి వారిలో 110 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించినట్లు తెలిపారు. శస్త్ర చికిత్సలు చేయించుకునే వారికి సోమవారం పెదకాకాని శంకర్ ఆస్పత్రిలో ఉచితంగా కంటి శుక్లం చికిత్స చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు దీక్ష, మంజోత్‌కౌర్, మహబూబ్, వైఆర్‌ఎస్ స్కూల్ కరస్పాండెంట్ యేచూరి వెంకట సైదయ్య, వెంకటేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ నాశం పెదబాబు, ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదెలు మృతి

రాజుపాలెం: విద్యుత్‌తీగలు తగిలి ఐదు పాడి గేదెలు మృత్యువాతపడ్డాయి. ఈ ఘటన మండలంలోని బలిజేపల్లి వద్ద ఆదివారం జరిగింది. ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. బలిజేపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ జొన్నలగడ్డ ప్రసాద్ తన పాడి గేదెలను మేతకోసం పొలానికి తోలుకొని వెళ్లాడు. బలిజేపల్లి–గణపవరం వద్ద గేదెలు మేతమేస్తుండగా విద్యుత్ హైటెన్షన్ తీగలు తెగిపడ్డాయి. దీంతో తీవ్ర విద్యుత్‌షాక్‌కు గురైన 5 పాడిగేదెలు అక్కడికక్కడే మృతిచెందాయి. సుమారు రూ.2.50లక్షలు నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోతున్నాడు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని విన్నవిస్తున్నాడు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నకరికల్లు: మండలంలోని గుండ్లపల్లి, చీమలమర్రి గ్రామాల్లో అంగన్‌వాడీ ఆయాపోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సూపర్‌వైజర్‌లు షేక్.రమీజున్, ఆనందకుమారిలు ఆదివారం తెలిపారు. గుండ్లపల్లిలో ఓసీ జనరల్, చీమలమర్రిలో ఓసీ కేటగిరీలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 21 నుంచి 35ఏళ్లలోపు వయస్సు కలిగి 7వ తరగతి పూర్తై స్థానికులై ఉండాలన్నారు. దరఖాస్తులను ఈ నెల 31వ తేదీలోగా అందజేయాలని సూచించారు.

రైలు కింద పడి వ్యక్తి మృతి

సత్తెనపల్లి: రైలు ఎక్కుతూ ప్రమాదవశాత్తు జారి పడి వ్యక్తి మృతి చెందిన ఘటన పల్నాడు జిల్లా సత్తెనపల్లి రైల్వేస్టేషన్‌లో ఆదివారం జరిగింది. మేడికొండూరు మండలం సిరిపురం గ్రామానికి చెందిన శివ ప్రసాద్ హైదరాబాద్ వెళ్లేందుకు సత్తెనపల్లి రైల్వేస్టేషన్‌లో ఆదివారం ఉదయం రైలు ఎక్కుతుండగా కాలుజారి రైలు కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో శివప్రసాద్ అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వే పోలీసులు ఘటనా స్థలాన్ని సందర్శించి మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అ'పూర్వ' కలయిక



1973 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

50 ఏళ్ల తరువాత కలిసిన 1973 పదో తరగతి బ్యాచ్

పెదకూరపాడు: వృద్ధ వయస్సులో బాల్య స్నేహితులు కలిసి పూర్వ జ్ఞాపకాలతో రోజంతా గడిపారు. చిన్ననాటి మధురస్మృతులు స్మరించుకుంటూ ఒకసారి చిన్నపిల్లలుగా మారి ఆనందంగా గడిపారు. గుర్తుపట్టలేని విధంగా ఉన్న బాల్య స్నేహితులను పలకరించుకుంటూ సందడిగా గడిపారు. 1973 పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం పెదకూరపాడులోని జెడ్పీ పాఠశాలలో జరిగింది. పూర్వ విద్యార్థి నాయకులు పఠాన్ వజీర్‌ఖాన్ నేతృత్వంలో ఒకే వేదికపై 50 ఏళ్ల తరువాత కలిశారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి నెట్టం రాఘురాం, ప్రముఖ వైద్యులు ప్రొఫెసర్ కొమరాబత్తిన రత్తయ్య హాజరయ్యారు. తమకు విద్యా బుద్ధులు నేర్పిన గురువులను స్మరించుకున్నారు. ఆశువులు బాసిన గురువులు, తోటి విద్యార్థులకు నివాళులర్పించారు. పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల సంఘం విరాళం ప్రకటించింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథి నెట్టం రాఘురాం మాట్లాడుతూ 50 ఏళ్ల తరువాత సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన తోటి విద్యార్థులను చూసి ఏంతో సంతోషంగా ఉందన్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను స్మరించుకున్నారు. పాఠశాలకు గౌరవం గుర్తింపు తెచ్చేలా పూర్వ విద్యార్థులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో 60 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం



దగ్ధమైన పూరిల్లు



పూర్తిగా మాడిపోయిన బంగారం

- కాలిపోయిన రూ.లక్ష 20 వేలు, 16 గ్రాముల బంగారం
- వైఎస్సార్ సీపీ నేత సహాయం

పెదకూరపాడు: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మండలంలోని లగడపాడు గ్రామంలో పూరిల్లు దగ్ధమైన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ఏకుల నరసింహారావు దంపతులు కౌలు రైతులు. ఆదివారం ఇంటికి తాళం వేసి వ్యవసాయ పనులకు వెళ్లారు. మధ్యాహ్నం విద్యుత్ షార్క్ సర్క్యూట్ కావడంతో పూరిల్లు పూర్తిగా దగ్ధమైంది. ఇంటిలో ఉన్న గ్యాస్ సిలిండర్ కూడా పేలిపోవడంతో మంటలు ఎగసిపడ్డాయి. ఇంటిలో ఉన్న సామాగ్రి, దుస్తులతో పాటు డ్వాక్రా రుణం కింద తీసుకున్న రూ.లక్ష 20వేలు, 16 గ్రాముల బంగారం కూడా పూర్తిగా కలిపోయింది. దీంతో నరసింహారావు కుటుంబం కట్టుబట్టలతో ఉండటంతో వైఎస్సార్ సీపీ జిల్లా నాయకులు బత్తుల కోటేశ్వరరావు, బత్తుల రాజేంద్రలు నిత్యావసర వస్తువులు, దుస్తులు అందించారు.